# పెదప బుద్ధులు

-వావిలికొలను రాజ్యలక్ష్మి

"అమ్మగోరండీ!"

"ఊఁ"

"మీరు నాకొక సాయం చేయాలమ్మా!"

"ఊఁ!"

"అమ్మా! మిమ్మల్నే..." అంట్లు తోముతున్న రత్తాలు ఒకింత గట్టిగా అంది.

"అబ్బ! వింటున్నానులేవే. విషయమేమిటో చెప్పు?"

"తప్పకుండా నాకు మీరో సాయం చేయాలమ్మగోరూ!"

వంటింటి గుమ్మంలో కుర్చీలో కూర్చుని హాల్లో ఉన్న టీవీ చూస్తున్న ప్రభావతి ఇటు తిరిగి అంది. "సాయం...సాయం...అంటున్నావుగాని, అసలు సంగేతేమిటో చెప్పడం లేదు నీవు. స్కూల్స్ తెరిచారు కదా! పిల్లలకు పుస్తకాలు కొనడానికి ఫీజలుకు డబ్బేమైనా కావాలా?"

"అబ్బే! వద్దమ్మా! పొస్తకాలు అన్నీ కొన్నాను. మా మావిచ్చాడు పైసలు.."

"మరింకేమిటే రత్తాలు?"

"ఇసయం ఏందంటే..పోయిన గురువారం నేను పిల్లలకి బడి డసులు కొనటాన్కి దిల్‌సుఖ్‌నగరికి ఎల్లానమ్మా. బట్టలు కొని తిరిగొచ్చేప్పుడు బాబా గుడి కాడికొచ్చాక నా కాళ్లకి మెత్తగా ఏదో తగిలినాదమ్మా. కిందికి చూద్దునుకదా! నల్లటి మగాళ్ల పర్సది. నిండుగా వుంది. దాన్ని అందుకొని అటు ఇటు చూసాను. పర్సు పోగొట్టుకున్న వారెవరైనా వెతుకుతున్నారేమోనని ఇద్దామని అనుకున్నా, కానీ అలాంటి వారెవరూ కనబడలా. ఎవరి హడావుడిలో వాళ్ళున్నారు. రోడ్ల ఎంబడి జనాలు ఎల్లుతున్నారు. వస్తున్నారు. చేతిలోని పర్సుని సటుక్కున బట్టల కవరులోకేసాను..." తాపీగా చెప్పుకొస్తున్న రత్తాలు మాటలకి మధ్యలోనే ఆత్రంగా అడ్డు తగిలింది ప్రభావతి.

"అందులో డబ్బుందా? ఎంతుందేమిటి?"

"ఆగండమ్మా..నన్ను సాంతం సెప్పనివ్వండి. ఆ పర్సు నా మొగుడి కంటబడిందంటే ఇక నా సంగతింతే. 'ఎక్కడి నుంచి పట్టుకొచ్చావో అక్కడే పడేసిరా!..' అంటూ నానా గొడవ సేస్తాడని నాకు భయమేసి పర్సును అటక మీదకి కట్టి పెట్టే ఎనకాల పడేలా ఏసి హమ్మయ్య అనుకున్నాను. ఆ తరువాత ఆ సంగతే మర్చిపోయానమ్మా. ఇయాల పర్సు సంగతి యాదికొచ్చి కుర్చీ ఎక్కి దాన్ని తీసి తెరిచి చూసాను. లోపల అరలో పొడవైన కొత్త నోట్లు సాలవున్నాయమ్మా! కాని, అవి మన నోట్లలాక లేవమ్మా. వాటిని ఏం సేయాలమ్మా? పాపం ఎవరి సొమ్మో! నాకెందుకమ్మా?..నా మావ సంపాదించినది, నా కష్టార్జితం అదే నాకు సాలమ్మా!"

"అలాంటి భావన ఉన్నదానివి...క్రిందపడి వున్న ఆ పర్సును మరి ఎందుకు తీశావే?"

"అదేనమ్మా..నేను చేసిన పెద్ద తప్పు"

కింద ఏది కనబడినా తళుక్కున మెరిసినా అసంకల్పితంగా వంగి అందుకుని చూడ్డం కొందరి నైజం. రత్తాలు కూడా ఆ కోవకే చెందినది. కానీ చాలా మంచి మనిషి. మూడో క్లాసు వరకు చదువుకుంది.

భాష కూడా సాఫీగానే ఉంటుంది తనది. కొన్ని కొన్ని పదాలు మాత్రం యాసగా మాట్లాడుతుంటుంది ఒక్కొక్కసారి.

"ఆ పర్సులో ఎవరివైనా ఫోన్ నెంబర్స్‌గాని, ఏవైనా కాగితాలు...చిన్న చిన్న క్రెడిట్ కార్డ్స్‌లాంటివేమైనా ఉన్నాయా? ఆ నెంబర్స్‌కి మనం ఫోన్ చేస్తే ఆ పర్సు పోగొట్టుకున్న వాళ్లొచ్చి తీసుకెళతారు"

"అబ్బే! అలాంటివేమీ లేవమ్మా. సత్తె ప్రెమాణంగా సెప్తున్నాను. ఆ నోట్లు తప్పించి మరే ఇతర సిన్న కాగితం ముక్క కూడా లేదమ్మా! ఆ పర్సు పారేసి ఇంద ఈ నోట్లు మీకు సూపించడాన్కి తెచ్చా.." అంటూ రత్తాలు తడి చేతులు పైట చెంగుకు తడుచుకొని జాకెట్లోనుంచి ఆ నోట్లు తీసి ఆవిడ చేతికిచ్చింది.

నోట్లన్నీ లైట్ పింక్ కలర్స్‌లో కొత్తగా తళతళలాడుతున్నై. వాటివంక పరీక్షగా చూసింది ప్రభావతి. 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్' అని పైన ఇంగ్లీష్‌లో వుంది. కింద కుడివైపు ఇరవై నెంబర్‌తో పాటు పౌండ్స్ అని రాసుంది. మధ్యలో అందమైన కిరీటంతో రాణి ముఖచిత్రముంది. లెక్కపెట్టింది. మొత్తం పాతిక నోట్లున్నాయి.

రత్తాలు ఎగాదిగా యజమానురాలివంక చూడసాగింది.

"ఇవి మనదేశం డబ్బు కాదే రత్తాలు! ఇంగ్లీష్ వాళ్ళ దేశంది. అక్కడినుంచి వచ్చిన వాళ్ళెవరో పాపం..పర్సు పోగొట్టుకున్నారు కాబోలు! మన డబ్బుతో పోల్చి చూస్తే ఈ డబ్బు విలువెంతో తెలుసా?" అంటూ పౌండుకు డెబ్బైపైనే వేసుకొని నోటి లెక్క కట్టి చెప్పింది. "ముప్పై వేలకు పైగానే ఉంటుందే ఈ డబ్బు విలువ"

ఆ మాట వినగానే ఆశ్చర్యంతో నోరు తెరిచి..భయంతో బిగుసుకుపోయింది రత్తాలు. "అమ్మో! అంత డబ్బే! మరి వీటిని ఏం చేయాలమ్మా? పోలీసులకు ఇచ్చేద్దామా?"

"పిచ్చి మొహందానా! ఇవి పట్టుకెళ్ళి పోలీసులకు ఇచ్చావంటే ఇంకింతే సంగతులు...ఇవి నీ దగ్గరకెలా వచ్చాయి? ఎక్కడైనా దొంగతనం చేశావా? ఎవరన్నా ఉగ్రవాదులతో చేయి కల్పావా? ఎక్కడైనా బాంబు పెడ్తానంటే వాళ్ళిచ్చినారా ఈ డబ్బు? చెప్పు? అంటూ నానా ప్రశ్నలడిగి నిన్ను మక్కలిరగదంతారు, జైల్లో పెడతారు. చక్కగా ఈ డబ్బంతా వాళ్ళే కాజేస్తారు" అంటూ ప్రభావతి విపులంగా చెప్పింది.

"మరి ఏం సేద్దామమ్మా?"

"నీవు నిజంగా నాకు నిజమే చెప్తున్నావా?"

"ఆఁ, సత్యంగా...ఆ భగవంతుడి సాక్షిగా నేను సెప్పేదంతా నిజమేనమ్మా!"

"నన్ను నమ్మమంటావా?"

"నిజంగా నా పిల్లలమీద..నా మావమీద ఒట్టమ్మా! దిల్‌సుఖ్‌నగర్ బాబా గుడికాడనే దొరికిందీ పర్సు. అందులో ఈ నోట్లు తప్ప, సిన్న కాగితం ముక్క కూడా లేదు"

"నీవా పర్సు తెచ్చి నాకు చూపాల్సిందే. దానిమీద ఎక్కడన్నా ఇంగ్లీషులో ఎవరి పేరన్న రాసుందేమో. నేను చూసేదాన్ని కదా? తొందరపడి ఎందుకు పారేశావ్?"

"అది మా మావ కంటబడితే ప్రెమాదమని ఆ పని సేసినాను.."

"సరే, మరి వీటిని ఏం చేద్దామంటావ్?"


"ఏమోనమ్మా! నాకేంటి తెలుసు? పోనీ, ఎవరి కంటబడకుండా బాబా గుడిలో హుండీలో వేసేసిరానామ్మా" అమాయకంగా అంటున్న రత్తాలు ముఖంలోగాని, ఆ కళ్ళల్లోగాని ఎక్కడా ఎలాంటి రవంత ఆశ కూడా కన్పించలేదు పరీక్షగా చూస్తున్న ప్రభావతికి.

అది నిజాయితీగా నిజమే చెప్తుందని పూర్తిగా నమ్మిందావిడ.

"రాత్రికి మా అబ్బాయ్ ఆఫీసునుంచి వచ్చాక వాడితో మాట్లాడి నీకు ఏ సంగతి రేపు చెప్తానే రత్తాలు! వీటిని మన నోట్లలోకి మార్చాలంటే బ్యాంక్‌కో, కరెన్సీ ఎక్ఛేంజ్ ఆఫీసుకో వెళ్లాల్సి వస్తుంది. ఇంద.. ప్రస్తుతం ఇవి నీ దగ్గరే వుంచుకో" అంటూ ప్రభావతి తిరిగి ఆ నోట్లని రత్తాలుకివ్వబోయింది.

"అమ్మో! నాకొద్దమ్మా. ఇవి మీకాడనే వుండనీ.." అంటూ రత్తాలు వెళ్ళిపోయింది.

ఆఫీసునుంచి వచ్చాక కొడుక్కి విషయమంతా చెప్పి, కాస్త సాయం చేయమని అడిగింది.



"అమ్మా! నేను ఆఫీసుపనితోనే చాలా బిజీగా ఉన్నాను. నానుంచి కాదు... అస్సలు నీవా డబ్బెందుకు తీసుకున్నావ్? ఆ నోట్లు తిరిగి రత్తాలుకి ఇచ్చేయ్! వాళ్ళిష్టం...ఏమన్నా చేసుకుంటారు'' కొడుకు కోపంతో అరుస్తా డని ముందే తెల్సుకాబట్టి మౌనంగా వుండిపోయింది. రాత్రి పడుకోబోయే ముందు ఈ విషయమే ఆలోచిస్తున్న ఆవిడకు చటుక్కున మెరుపులాంటి ఆలోచన వచ్చి ఇక నిశ్చింతగా నిద్రపోయింది.

***


కాఫీ టిఫిన్ కానిచ్చి పేపర్ చూస్తున్న పారిజాతానికి ఎవరో గేట్ తీసిన అలికిడి విని లేచి వెళ్ళి చూసింది. ఎదురుగా పక్కింటి ప్రభావతి కనబ డింది. "రండి..రండి..'' చిరునవ్వు ముఖంతో అంటూ సాదరంగా ఆహ్వా నించింది. లోపలికొచ్చి సోఫాలో కూర్చున్నారిద్దరూను.

"అన్నయ్యగారు ఆఫీసుకెళ్ళిపోయారా?''



## కోలీవుడ్‌కి గుడ్‌బై?

నయనతార తమిళ సినీరంగానికి కొంత కాలంపాటు దూరంగా వుండాలనుకుంటోందిట. మలయాళంలో కంటే తెలుగు, తమిళ రంగా ల్లోనే ఎక్కువ పాపులారిటీ వున్న నయనతార గురించి తమిళ సినీ రంగం లోనే ఎక్కువగా పుకార్లు పుడుతున్నాయని, వాటి వల్ల విసిగిపోయి తనీ నిర్ణ యానికొచ్చినట్టు ఆమె సన్నిహితుల ఉవాచ. టాలీవుడ్‌లో తనకి మంచి గౌరవం వుందని కాబట్టి ఇక్కడ సినిమాలు చేయడమే బావుంటుందని భావిస్తూ, అటు బాలీవుడ్ ప్రయత్నాలు కూడా ముమ్మరంగానే చేస్తోందిట.




"ఆ..ఇందాకనే వెళ్ళారు''

"మీతో కొంచెం పనుండి వచ్చాను. అన్నయ్యగారు కూడా వుండుంటే బాగుండేది''

"చెప్పండి విషయమేమిటో. ఆయన సాయంత్రం వస్తారుగా నేను చెప్తా లెండి''

"మీ అబ్బాయ్‌వాళ్లు లండన్‌లో ఉంటారు కదా! మీరు కూడా అప్పుడ ప్పుడు వెళ్ళి వస్తుంటారుగా? నా దగ్గర కొన్ని పౌండ్స్ కరెన్సీ వుంది. వాటిని మన కరెన్సీలోకి మార్చుకోవడం మీకు పెద్దగా కష్టం వుండదనుకుంటాను. నాకైతే ఏ బ్యాంక్‌కు వెళ్ళాలో, ఏ కరెన్సీ ఎక్ఛేంజ్ ఆఫీసుకెళ్ళాలో సరిగ్గా తెలీదు..మా వాడికి చెప్తే..ఆఫీసులో వర్క్ ఎక్కువగా వుందట..తనవల్ల కాద న్నాడు''

"ఓహ్! ఇంతేనా? ఆయన వచ్చాక చెప్తాలెండి. ఇలా అడుగుతున్నాడ ననీ ఏం అనుకోకండి..అయినా, ఇంగ్లాండ్ కరెన్సీ మీ దగ్గరికెలా వచ్చిం దండీ బాబూ?'' నవ్వుతూనే అడిగింది పారిజాత.

చెప్పాలా? వద్దా? అనుకొని లోలోన ఓ క్షణం ఆలోచించి..ఇందులో అబద్ధం చెప్పాల్సిన అవసరమేముంది? అని రత్తాలుకు పర్సు దొరికింది మొదలుకొని అవి తెచ్చి తనకిచ్చిన సంగతివరకూ అంతా పూసగుచ్చిన ట్లుగా చెప్పుకొచ్చింది ప్రభావతి.

అది వినగానే పారిజాత ముఖంలో కొంచెం మార్పేదో గోచరించింది. ఎందుకంటే రత్తాలు మొదట్లో వాళ్ళింట్లో కూడా పని చేసేది. ఓ నెలరోజుల క్రితం పారిజాతతో ఏదో గొడవొచ్చి పని మానుకొంది. మళ్ళీ పని చేయ మని ఆమె బ్రతిమిలాడినా రత్తాలొప్పుకోలేదు. అదీ.. ఆవిడ ఒళ్ళుమంటకి కారణం. ఈవిడ ద్వారా తామిప్పుడు దానికి సహాయం చేయాలా? అని అనుకుంటూ మనస్సులో కొంచెం మధనపడసాగింది. పైకి మాత్రం "సరే లెండి! అది ఎవరింట్లోనో కొట్టేసిన బాపతు కాదుకదా? లేనిపోని గొడవ మన మెడకి చుట్టుకుంటుంది!'' అంది కొంచెం గంభీరంగా.

"అబ్బే! అలాంటివేం కాదులెండి. దాని దగ్గర దొంగబుద్ధులేం లేవులెండి. మీకూ తెలుసుగా? అయినా ఒకటికి పదిసార్లు అడిగానులెండి. దిల్‌సుఖ్‌న గర్ బాబా గుడి దగ్గరే వారం రోజుల క్రితం దొరికిందా పర్సని పదే పదే ఒట్టేసి చెప్పింది. ఇరవై పౌండ్స్ నోట్స్ మొత్తం పాతిక ఉన్నాయి. అన్నయ్య గారికి ఇవ్వండి..'' అంటూ ఆమెకిచ్చి కాఫీ తాగి ఇంటికి తిరిగొచ్చింది ప్రభా వతి.

***

మరుసటి రోజు ఉదయం రత్తాలు పనిలోకి వస్తూనే ప్రభావతి రెండు కాళ్ళు బిగ్గరగా చుట్టేసుకొని భోరున విలపించసాగింది. ఏమైందో ఆమెకేం తెలియక కంగారుపడిపోతూ "అయ్యో! ఏమిటి రత్తాలు? ఏమైంది? ఎందు కేడుస్తున్నావ్? మీ మావ ఏమన్నా అన్నాడా?'' అంటూ ప్రశ్నల వర్షం కురి పించింది.

"అదికాదమ్మా! ఇందాక నేను మనింటికి పనిలోకి వస్తుంటే బయట నిల్చున్న పక్కింటి పారిజాతమ్మగారు, వాళ్ల సార్ ఇంట్లోకి పిలిచి నన్ను నానా మాటలు అన్నారమ్మా... మీరెళ్లి నాకు ఆ డబ్బు దొరికిన సంగతి చెప్పి ఇచ్చారట కదా? ఆ డబ్బు నేను వాళ్లింట్లో పని చేసినప్పుడు దొంగి లించానట. ఆమధ్య వాళ్ళు అబ్బాయి దగ్గరికి ఆ దేశం వెళ్లినప్పుడు వాళ్ళని ఏమన్నా కొనుక్కోమని యిచ్చాడట. వాళ్ళింట్లో పనిచేసినప్పుడే నేనా డబ్బు కొట్టేసి...ఇన్నాళ్లుగా దాచి అక్కడెక్కడో బజార్లో పర్సు దొరికిం దని దొంగ కబుర్లతో మాయమాటలు చెప్పి మిమ్మల్ని నమ్మించి మీకిచ్చా నట. ఆ డబ్బు వాళ్ళదేనట...అంతే డబ్బట! అవే నోట్లటమ్మా! నా మీద

దొంగతనం కేసుపెట్టి పోలీసులకి పట్టించి తన్నిస్తారటమ్మా. జైల్లో పెట్టిస్తారట..'' ఓ ప్రక్క ఏడుస్తూనే రత్తాలు విషయమంతా చెప్పేసి "ఇదంతా మా మావకు తెలిసిందంటే నన్ను నిజంగా చంపేస్తాడమ్మా!'' అంది.

ఇంత గందరగోళం జరుగుతుందని ఊహించని ప్రభావతికి ఏం చేయాలో ఓ క్షణం పాలుపోలేదు. "నీవు ముందుగా కళ్ళు తుడుచుకో. పారిజాతమ్మతో నేను మాట్లాడతాను. అయినా వాళ్ళింట్లో ఎప్పుడో డబ్బు పోతే ఇప్పుడు నిన్నడకడమేమిటే?...కనీసం మాటవరసకైనా నాతో ఎప్పుడూ అనలేదు డబ్బు పోయిన విషయం. ఇదేదో మహా విడ్డూరంగా వుంది. నీవేం భయపడకు. ఈ వ్యవహారమేమిటో నేనే వాళ్ళింటికెళ్ళి కనుక్కుంటాను''

"మీరీ డబ్బు విషయం వాళ్ళకెందుకు సెప్పినారమ్మా?'' ఏడుస్తూనే అడిగింది రత్తాలు. ప్రభావతి కూడా చాలా బాధపడింది. ఇలా జరిగినందుకు తప్పంతా తనదే అన్నట్లుగా ఫీలవ్వసాగింది. "అదికాదే రత్తాలు! మా అబ్బాయికి ఆఫీసులో పని చాలా ఎక్కువగా వుందట..తాను వెళ్ళడానికి కాదన్నాడు. నాకైతే ఎక్కడికెళ్ళాలో ఏమిటో సరిగ్గా తెల్సి చావదాయె! పారిజాతంగారు కొడుకు దగ్గరికి ఆ దేశం వెళుతుంటారు కదా! వారి వలన ఈ పని ఈజీగా అవుతుందని ఇచ్చానుగానీ, అస్సలు ఆ డబ్బు నాదే అని చెప్పింటే ఈ గందరగోళం లేకపోయేది''

"ఆ డబ్బు నాకొద్దమ్మా! వాళ్ళనే తీసుకోమన్నాను. ఎరక్కపోయి నేనా పర్సును చేతిలోకి తీసుకున్నాను...పాపిష్టిదాన్ని..!'' రత్తాలు పైట చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ తెగ బాధపడింది.

పక్కింటి పారిజాత...ఆమె భర్త ఇద్దరూ గవర్నమెంట్ ఉద్యోగాలు చేసి, రెండేళ్ళ క్రితమే కొన్ని నెలల తేడాతో రిటైర్ అయ్యారు. ఇద్దరికీ కల్పి ఓ పాతిక వేలదాకా రావచ్చు. ఉన్న ఒకానొక్క కొడుకు ఇంజనీరు. లండన్‌లో ఉద్యోగం చేస్తూ లక్షలు సంపాదిస్తున్నాడు. ఖరీదైన కారు..ఇంచుమించు యాభై లక్షల విలువ చేసే మేడ, నెలవారీగా అద్దెలొచ్చే రెండిండ్లూ, నాలుగు షాపులున్నాయి.

లింగు లిటుకుమంటూ...ఆ లంకంత కొంపలో ఉండేది వాళ్ళిద్దరే. పూజలు పునస్కారాలు, దానం ధర్మంలాంటి కార్యక్రమాలేవీ వారెరుగరు. ఉన్న ఆస్తి చాలదన్నట్లుగా రిటైర్ అయ్యాక ఇంట్లో కూర్చుంటే ఏం తోచడం లేదంటూ ప్రైవేట్‌గా ఓ చిట్‌ఫండ్ కంపెనీ పెట్టుకొని బిజినెస్ చేస్తున్నాడాయన. ఆధ్యాత్మిక చింతనతో 'కృష్ణా..రామా...' అనుకుంటూ ప్రశాంతంగా గడపక ఇంకా ఈ వయస్సులో కూడా డబ్బు సంపాదించాలన్న తపన...ఆశ ఎందుకో?

వాళ్ళు 'ఆ డబ్బు తమదే' అని అన్న ఆ విషయంలో నమ్మశక్యంకాని విధంగా ఎన్నెన్నో ఆలోచనలు...ప్రభావతి మనస్సులో పరిపరివిధాల పోతున్నై. "రత్తాలు! నీవేం బాధపడకు..వాళ్ళతో నేను మాట్లాడతాను లేవే'' అంటూ అభయమిచ్చి ధైర్యం చెప్పింది.

***


"ప్రభావతిగారూ!..'' అంటూ రయ్యి రయ్యిమంటూ పారిజాతంగారే వీళ్ళింటికొచ్చింది. "రత్తాలు ఈపాటికి మీకంతా చెప్పేసే వుంటుంది కదూ? మీరు దాని మాటల్ని గుడ్డిగా నమ్మారు..చూశారా! తెలివిగా ఎంత నాటకమాడిందో టక్కులాడి! మా ఇంట్లో పనిచేస్తున్నప్పుడే ఆ డబ్బు నొక్కేసి,'ఇన్నాళ్ళుగా దాచేసి అవి ఎక్కడో పర్సులో దొరికినట్లుగా దొంగ కథలల్లి...మిమ్మల్ని బోల్తా కొట్టించి నమ్మించింది. మీరిచ్చిన డబ్బుతో పాటు, మావారి దగ్గరున్న పౌండ్స్ కూడా మన కరెన్సీలోకి మార్చుదామని బీరువాలో వెతికారట. అవి లేవు. మావారి దగ్గర సరిగ్గా ఎన్ని పౌండ్స్ ఉన్నాయో ఈ నోట్లు కూడా అన్నే వున్నాయి. మా వారివి కూడా సేమ్ ఇరవై పౌండ్స్ నోట్లేనట. మేము లండన్ వెళ్ళినప్పుడు మా అబ్బాయి ఇచ్చాడట. ఇండియా వెళ్ళాక మీరూ మమ్మీ ఈ డబ్బుతో ఏమన్న కొనుక్కోమని. ఇక్కడికొచ్చాక వాటికి రబ్బర్ బాండ్‌వేసి చుట్టి జాగ్రత్తగా బీరువాలో పెట్టారట. ఎప్పుడో ఈయన ఫైళ్ళకని..కరెంట్ బిల్స్, ఫోన్ బిల్స్ పెడ్తూ..చీటికి మాటికి అస్తమానం బీరువా తెరుస్తూనే ఉంటాడు. ఎప్పుడో అవి కింద పడిపోయి ఉంటాయి. ఈయన గమనించి వుండడు. రత్తాలెప్పుడో ఇల్లు ఊడ్చేటప్పుడు ఆ డబ్బుతీసి అటకమీద పడేసింది కాబోలు! ఎలాగూ మా ఇల్లు పని చేయడం మానేసిందికదా! దానికిక ఏ భయం లేక..కొత్త కొత్త దొంగకథలల్లి మీకు నమ్మశక్యంగా చెప్పింది. చూడండీ! ఎంత చిత్రవిచిత్రంగా ఉందో? ఉదయం రత్తాల్ని పిలిచి నేనూ మావారు బాగా చీవాట్లేసి 'మా ఇంట్లో దొంగతనం చేశావ్? పోలీసులకి పట్టిస్తామని' బెదిరించేసరికి 'అవునమ్మా! ఆ డబ్బు మీదే..క్షమించండమ్మా...మీరే ఉంచే



## డిస్నీలాండ్ పుట్టుక

ఫస్ట్ డిస్నీల్యాండ్‌ని కాలిఫోర్నియాలోని అనాహియమ్‌లో 15-7-1955 తేదీన ప్రారంభించారు. ఆ ఉత్సవాన్ని 28,154మంది వ్యక్తిగతంగా తిలకించారు. 9 కోట్లమంది టీవీలో చూసారు. దీన్ని వాల్ట్ డిస్నీ 17 మిలియన్ డాలర్ల ఖర్చుతో నిర్మించాడట!

-తటవర్తి



సుకోండి. నాకేం వద్దమ్మా!' అంటూ దొంగతనం ఒప్పేసుకుందండీ!'' అంటూ తామేదో ఘనకార్యం చేసినట్లుగా తెలివిగా చాకచక్యంతో దొంగని పట్టుకున్నట్లుగా సంతోషంతో వికసించిన ముఖంతో చేతులు తిప్పుతూ ఇంకా రత్తాలు మీద ఏమేమో మాట్లాడుతూనే వుంది పెద్ద గొంతుకతో ఆవిడలా. ప్రభావతికి ఇక వినాలనిపించలేదు. "అయినా మీ ఇంట్లో డబ్బు పోయినట్లుగా ఎప్పుడూ నాతో మాట వరసకైనా అనలేదే...''

"ఏదీ? నాకు మాత్రం తెలిస్తేనా? ఈరోజేగా తెలిసింది. మావారు డబ్బు పోయిన సంగతి చూసుకున్నది?''

"పోనీలెండి. నా ద్వారా మీ డబ్బు మీకు మళ్ళీ దొరికింది. సంతోషం!..ఇవాళ రేపు ఎవర్ని నమ్మాలో, ఎవర్ని నమ్మకూడదో అర్థం కావడంలేదు. నిజమేమిటో అబద్ధమేమిటో ఆ భగవంతుడికే తెలియాలి''

"అంటే మీ ఉద్దేశ్యం? మేం అబద్ధం చెప్తున్నామనా?'' ఆవిడ కోపంగా అడిగింది.

## అంతరిక్షంలో ఎస్ట్రోనాట్ కొడుకు

అమెరికా 1973లో అంతరిక్షంలోకి పంపిన మొదటి స్పేస్ స్టేషన్ 'స్కైలాబ్'లో 59 రోజులు గడిపిన వ్యోమగామి ఒవెన్ గారియాట్. తర్వాత 1983లో కొలంబియా వ్యోమనౌకలో కూడ స్పేస్‌లోకి వెళ్ళాడు. ఇప్పుడు రిటైరయిన ఆ ఎస్ట్రోనాట్ కొడుకు రిటర్డ్ ఇటీవల కంప్యూటర్ గేమ్స్‌లో ఎంత డబ్బు గడించాడంటే కజకిస్థాన్ నుంచి అంతరిక్షంలోకి వెళ్ళి ఒక వారం పాటు ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్లో టూరిస్టుగా గడపటానికి 30 మిలియన్ డాలర్ల టికెట్టు కొనుక్కున్నాడట! తన ఖర్చుతో అయితేనేం ఒక ఎస్ట్రోనాట్ కొడుకు అంతరిక్షంలోకి వెళ్ళటం ఇదే మొదటిసారి!

## తారుమారు

ఇటీవల టెక్నాలజీ బిజినెస్, ఆర్మీ, స్పేస్ ట్రావెల్- ఇదీ అదీ అన్న తేడా లేకుండా మగవాడు చేసేపనల్లా ఆడది చేసి చూపించింది. అంతేకాక ఈ మధ్య ఆడవాళ్ళు హార్స్‌రేస్‌లో 'జాకీ'లుగా కూడా పాల్గొంటున్నారంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదనిపించింది. ఇక మగవాళ్ళ వంతు వచ్చిందిలా గుంది! ఆడవాళ్ళు చేసే పనులు తాము చేసి చూపించలేమా అని అనుకుంటున్నట్టు కొందరు బెల్లీ డాన్సర్లుగా అవతారమెత్తుతున్నారు. మనదేశంలో రూప ఏకైక ఉమెన్ జాకీగాను, హరీష్‌కుమార్ (ఉరఫ్ క్వీన్ హరిష్) ఏకైక బెల్లీ డాన్సరుగాను ఇటీవల పేరొందారు!

-తటవర్తి




"అయ్యో! ఎంతమాట పారిజాతంగారూ! అయిందేదో అయిపోయింది. అదసలే బెదురుగొడ్డు. పోలీసులు..కేసులు అని అంతదూరం పోవద్దని నా మాటగా అన్నయ్యగారికి చెప్పండి. మీ డబ్బు మీకు క్షేమంగా చేరింది. అది ముఖ్యం..'' ఆవిడతో సానుకూలంగా మాట్లాడి సర్దిచెప్పి కూల్‌చేసి ఓ గ్లాసెడు ఆరంజ్ జ్యూస్ ఇచ్చి పంపించింది ప్రభావతి.

నోట్లన్నీ ఒకచోట దగ్గరగా చుట్టి రబ్బర్ బ్యాండ్ వేసి ఉంచితే చాలా రోజులు అలాగే వుంచితే, అవి అలాగే ఉండచుట్టుకుని పోతాయి కానీ, తిన్నగా వుండవు. రత్తాలిచ్చిన నోట్లన్నీ కొత్తగా సాపుగా ఉన్నాయి. ఆ నోట్లు ఖచ్చితంగా వాళ్ళవి కావని ప్రభావతికి కూడా ఖచ్చితంగా తెలుస్తూనే ఉంది. దీనికంతటికి కారణం తన తెలివి తక్కువతనం. రత్తాలికి తెలియకుండా తానీ విషయంలో చొరవ తీసుకుంది. లేకుంటే కాలేజీ లెక్చరర్‌గా పనిచేసే తన మేనకోడలి సహాయం తీసుకొని ఉండింటే ఇంత రసాభాస జరగకపోయేది అని పరిపరివిధాలా ఆలోచించసాగింది.

★★★

ఈ విషయం జరిగాక సరిగ్గా మూడు రోజులకి ప్రభావతి వాళ్ళింటి ముందు ఆటో దిగింది. చేతిలోని పర్సులోనుంచి కీ తీసి తలుపుకున్న తాళం తీస్తోంది. అప్పుడే రత్తాలు వచ్చింది "ఎక్కడికెళ్ళారమ్మా మీరు? ఇందాక కూడా ఓమారు వచ్చి చూసి వెళ్ళాను. ఇంటికి తాళం వేసుంది. అంట్ల సామాను కడగడానికని మళ్ళీ వచ్చాను''

"నేను హాస్పిటల్‌కెళ్ళి ఇప్పుడే వస్తున్నానే!'' అంటూ తలుపులు తెరిచి లోపలికెళ్ళి కూర్చుందావిడ.

"ఏం? ఎవరికన్నా మీ చుట్టాలకి బాగాలేదామ్మ?''

"నీకీ విషయమింకా తెలీదా?''

"ఏ విషయమమ్మా?''

"అదేనే..మన పక్కింటి పారిజాతగారికి, వాళ్ల ఆయనకి యాక్సిడెంట్ జరిగిందీ రోజు''

"అయ్యో పాపం! నాకు తెలియదమ్మా? తెల్సింటే నేను కూడా మీతో పాటు హాస్పిటల్‌కు వచ్చేదానమ్మా. ఎలా ఉన్నారమ్మా వాళ్ళిప్పుడు?'' బాధతో సానుభూతిగా అడిగింది రత్తాలు.

"కారు మాత్రం బాగా డామేజ్ అయిందట. ఆవిడకేమో చిన్న చిన్న దెబ్బలు ఒళ్లంతా తగిలాయి. సారేమో డ్రైవింగ్ సీట్లో ఉన్నాడు కదా! దెబ్బలు బాగా బలంగా పెద్దవే తగిలాయి. ఓ కాలు పూర్తిగా విరిగిపోయిందట. ఆపరేషన్ చేస్తున్నారు. ఆయన కోలుకోవడానికి ఎంత లేదన్నా ఓ ఐదారు నెలలైనా పట్టొచ్చునని డాక్టర్స్ అంటున్నారు. ఓ లక్ష రూపాయలు ఖర్చు అవ్వవచ్చునేమో...? వాళ్ళబ్బాయికి ఫోన్ చేశారట ఫ్రెండ్స్. సిటీలో ఉండేవాళ్ళు చుట్టాలు, స్నేహితులు వచ్చారు వీళ్ళని చూడడానికి..''

ప్రభావతి చెప్పిన విషయమంతా విన్న రత్తాలు పేలవంగా ఓ నిట్టూర్పు విడిచి, చూపుడు వేలు పైకి చూపిస్తూ.. "న్యాయమేదో అన్యాయమేదో, అబద్ధమేదో నిజమేదో ఆడికి...ఆ పైవాడికి అంతా తెలుసునమ్మా!'' అంది వేదాంతిలా.

అది ఎవర్ని గురించి ఆ మాట అందో..సూక్ష్మగ్రహి అయిన ప్రభావతి కిట్టే క్షణంలో అర్థమైంది. "ఒక్కొక్కరి మనుష్యుల మనస్తత్వాలు ఎందుకిలా ఉంటాయో తెలియదు రత్తాలు! ఆశకి హద్దుండాలి. మనం చచ్చేరోజు ఈ డబ్బు దస్కం, మేడలు, మిద్దెలు ఇవన్నీ మన వెంట తీసుకెళతామా? పిదప బుద్ధులు...పిసినారి గుణాలూను...'' అంటూ ఆవిడ వంటింటి వైపు వెళ్ళింది. రత్తాలు మౌనంగా ఆవిడ వెనకాలే నడిచింది.

★